క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో గంగమ్మతల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో తలపనూరు గంగమ్మతల్లి

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు పంట పొలాల్లో వెలసిన గంగమ్మ, ఉరుటూరు గ్రామంలో వెలసిన చౌడమ్మతల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంకాలమ్మకు..

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. అనంతపురం, కర్నూలు, తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

శ్రీకాంత్‌రెడ్డికి సన్మానం



శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సింహాద్రిపురం : మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బలపనూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాచమల్లు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పులివెందులలోని శ్రీకాంత్‌రెడ్డి స్వగృహంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం



జ్యోతులు ఎత్తుకుని నాట్యం చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో ఆదివారం జ్యోతుల ఉత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో దాదాపు 25 జ్యోతులు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పోలీస్ అధికారులు గట్టి బందోబస్తు నిర్వహించారు. 3 రోజుల అనంతరం గొడుగుల ఉత్సవాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



వైద్యపరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌ఓ దిల్షాద్ తెలిపారు. ఆదివారం సుంకేసుల సచివాలయ పరిధి, బిదినంచెర్ల, దేవతాపురం గ్రామాల్లో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వేతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం సుభాషిణి, ఆశాకార్యకర్త చంద్ర శోభ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పులివెందులలో చెత్తను తొలగిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చునని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్వచ్ఛతాహిసేవా కార్యక్రమాన్ని మున్సిపాలిటీ, లయోల డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు, లయోలా కళాశాల, రాజారెడ్డి పార్కులలో శ్రమదానం కార్యక్రమంలో వారు పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రంగనాథస్వామి, అంకాలమ్మ దేవస్థాన కమిటీ చైర్మన్‌లు సుధీకర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్, నూరుబాషా సంఘం అధ్యక్షుడు రసూల్, లయోల కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్, స్నేహితఅమృతహస్తం సేవాసమితి రాజులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్.భేగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతహిసేవా కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థులచే మార్కెట్‌యార్డులో నిర్వహించారు. మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వివిధ సంఘాల సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో స్వచ్ఛత ర్యాలీ

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో స్వచ్ఛతాహిసేవా ర్యాలీ నిర్వహించినట్లు డైరెక్టర్ కసిరెడ్డి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం జాతీయ సేవా సమితి ప్రోగ్రాం అధికారులు తదితర విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. అనంతరం శ్రమదాన కార్యక్రమంలో భాగంగా చెత్తచెదారాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమాల పట్ల విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ స్కూల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా వేంపల్లె క్లస్టర్ సీడీపీఓ సునీత పిల్లలకు, తల్లిదండ్రులకు స్వచ్ఛతసేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలను నాటించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వైఎస్‌ఆర్ మెమోరియల్ పార్కులో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలిహరిప్రసాద్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : పుష్పగిరిలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాల్లోని పలు ఆలయాల ప్రాంగణంలో జిల్లా పురావస్తు శాఖ జిల్లా అధికారి రాజాయోగేష్ ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది చెత్తను తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పర్యాటక ప్రదేశాలు, ఆలయాల సందర్శనకు వచ్చే వారు ఆయా పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు తోడ్పాటును అందించాలన్నారు.

ముద్దనూరులో...

ముద్దనూరు : ప్రధాన మంత్రి పిలుపుమేరకు స్థానిక రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛత సేవా కార్యక్రమంలో రైల్వే సిబ్బంది పాల్గొని రైల్వే ప్లాట్‌ఫాం, రైల్వే ట్రాక్, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. రైల్వేస్టేషన్ మేనేజర్ భాస్కర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఫారెస్టు అధికారులు రేంజి కార్యాలయంలో స్వచ్ఛతిసేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.



వేంపల్లె : ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



పుష్పగిరిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది




ఎర్రగుంట్లలో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, మానవత స్వచ్ఛంద సేవ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుక పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ పి.జగన్నాథ్, మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు రఘురామిరెడ్డి, మేడ రమేష్, గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడికి ఊరట



– కిలో టమాట రూ.12, బెండకాయ కిలో రూ.15

కడప అగ్రికల్చర్: కూరగాయల ధరలు కొండ దిగి వచ్చాయి. అందుబాటు ధర ఉండడం వినియోగదారులు ఊరటనిస్తోంది. మొన్నటి వరకు అధిక రేట్లు పలికిన టమాటా ధర ప్రస్తుతం కిలో రూ.12కు చేరింది. కిలో రూ.250 ఉన్న అల్లం ధర ప్రస్తుతం రూ.120 పలుకుతోంది. వీటితోపాటు పలు కూరగాయల ధరలు తక్కువ ధరకే లభిస్తున్నాయి. కడప రైతు బజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి.

కూరగాయల ధరలు (రూపాయలలో)

టమాట	12	బీరకాయ	30
బెండకాయ	15	క్యారట్	40
క్యాబేజీ	20	బంగాళదుంప	40
మట్టికాయ	20	బీట్రూట్	40
కాకరకాయ	20	కాలీఫ్లవర్	45
వంకాయ	20	అలసందలు	50
మిరపకాయ	25	బీన్స్	65
దొండకాయ	24	అల్లం	120

రేపు ఆత్మీయ కృతజ్ఞత సభ

వీరపునాయునిపల్లె : మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో మంగళవారం స్థానిక వీఆర్‌ఎస్ డిగ్రీకళాశాలలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అ ధ్యక్షుడు రఘునాథరెడ్డిలు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సభకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజుల్‌రెడ్డిలు పా ల్గొంటారని ప్రజాప్రతినిధులు, మండటస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటోవాలలు

వేంపల్లె : వైఎస్‌ఆర్ వాహనమిత్ర పథకం పేదలకు వరంలాంటిదని వేంపల్లె జడ్పీటీసీ ఎం.రవికుమార్ రెడ్డి ఆదివారం పట్టణంలోని ఆటోవాలా యజమానులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఆటోవాలాలు పడుతున్న కష్టాలను చూసి అన్ని విధాల ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సొంత ఆటోలు, టాక్సీలు, క్యాబ్ యజమానులకు ఏటా రూ.10వేలు వైఎస్‌ఆర్ వాహనమిత్ర పథకం ద్వారా సాయం అందజేస్తున్నారన్నారు. ఆటోవాలా ఖాతాలో డబ్బులు జమకావడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహమతుల్లాఖాన్, మాజీ వార్డు మెంబర్ ఖదిరుల్లా సోషల్ మీడియాకు కన్వీనర్ దౌలత్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడం అభినందనీయం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో పేదలకు మెరుగైన సేవలదించడంలో ఫాతిమా మెడికల్ కళాశాల చూపుతున్న చొరవ అభినందనీయమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఫాతిమా మెడికల్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతి పీజీ వైద్యుడు మారుమూల ప్రాంతాలకు వెళ్లి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఏటా 100 మంది ఎంబీబీఎస్, 25 మంది పీజీ వైద్యులను సమాజానికి అందించడం ఆనందంగా ఉందన్నారు. తిరుపతి స్విమ్స్ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ బీసీఎం.ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిని చూసి తాము గర్విస్తున్నామన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఏక్యూ జవ్వాద్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్య సేవల దిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శైలారేఖ, డైరెక్టర్ జయరామిరెడ్డి, ఓబులేశు, సల్మాన్ ముర్తాజా, ఐహెచ్ ఫరూఖ్, రామమనోహర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డెన్ల నియామకం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలకు 9 మంది నూతన వార్డెన్లను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. నియమితులైన వారిలో డా. బి. శ్రీనివాసరెడ్డి(అప్లైడ్ మ్యాథమాటిక్స్), డా. పి.వి.వరప్రభాకర్(బిజినెస్ మేనేజ్‌మెంట్), డా. ఎస్.రామమనోహర్‌రెడ్డి(నానో టెక్నాలజీ), డా. డి.ఆర్.సతీష్‌బాబు (పొలిటికల్‌సైన్స్), డా. ఎం.రాఘవేందర్ (ఫిజిక్స్), డా.ఎస్. సునీత(అప్లైడ్ మ్యాథమాటిక్స్), డా.ఎస్.సుమిత్ర (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్), డా. వి.అనుప్రసన్న (జువాలజీ), డా. జె. మెర్సీవిజేత (ఇంగ్లీషు)లు ఉన్నారు. చీఫ్ వార్డెన్ వద్ద వారంతా రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



శోభారాణి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిశోధకురాలు ముదిరెడ్డి శోభారాణికి విశ్వవిద్యాలయం ఆదివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగు శాఖ ఆచార్యులు డా.పాలెం రమాదేవి పర్యవేక్షణలో రెండు దశాబ్దాల రాయలసీమ కథా సాహిత్యం - గ్రామీణ జీవితం (1991-2010) అంశంపై ఆమె చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ దక్కిందని వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పెద్దముసలిరెడ్డిపల్లెకు చెందిన ఈమె 2018లో యూజీసీ జేఆర్‌ఎఫ్ ద్వారా పీహెచ్‌డీలో ప్రవేశం పొందారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడమేగాక 20కిపైగా పరిశోధన వ్యాసాలను రాశారు. వైవీయూ అధికారులు, పరిశోధకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రబీలో శనగ సాగుపై రైతుల దృష్టి

- 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు
- నియోజకవర్గానికి 15,305 క్వింటాళ్ల విత్తనాల మంజూరు
- అక్టోబర్ 10 నుంచి రైతులకు పంపిణీ



రబీలో శనగ సాగుకు సిద్ధం చేసిన పొలం

వేముల : ఈ ఏడాది రబీలో శనగ సాగుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే శనగ సాగుచేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. పులివెందుల నియోజకవర్గంలో రబీలో 40వేల ఎకరాలకు పైనే శనగపంట సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. కాగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను నిరాశపరిచింది. తీవ్ర వర్షాభావం నెలకొనడంతో వర్షాధారం కింద పంటలు సాగుకు నోచుకోలేదు. సకాలంలో వర్షాలు వస్తే ఖరీఫ్‌లో పత్తిసాగుపై రైతులు దృష్టిపెట్టారు. అయితే వర్షాలు లేకపోవడంతో భూములు బీడులుగా మారాయి. ఖరీఫ్ సీజన్ ముగిసేవరకు ఆసించిన మేర వర్షాలు లేవు. దీంతో ఖరీఫ్‌లో రైతులు పంటలు సాగుచేసుకోలేకపోయారు. ఖరీఫ్‌లో పంటలు లేకపోయినా రబీ సీజన్‌కైనా సకాలంలో వర్షాలు వస్తాయన్న ఆశతో రైతులు శనగ సాగుపై దృష్టి సారించారు.

అదనంగా సేద్యపు ఖర్చులు

ఈ యేడు ఖరీఫ్‌లో పంటలు లేకపోగా బీళ్లుగా ఉన్న పొలాల్లో సేద్యాలు చేసేందుకు అదనంగా ఖర్చులు అయ్యాయని రైతులు అంటున్నారు. ఖరీఫ్‌లో అరకొర వర్షాలతో భూములలో కలుపు మొలకెత్తడంతో సేద్యపు ఖర్చులు రైతులకు భారమయ్యాయి. ఎకరా సేద్యం చేయాలంటే ట్రాక్టర్లకు రూ.700లు ఇవ్వాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఇలా సీజన్‌లో కలుపు లేకుండా చేసుకునేందుకు 2, 3 సార్లు సేద్యం చేయడంతో ఖర్చులు పెరిగిపోయాయి. అదే ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో వర్షాలు కురిసి ఉంటే పంటలు సాగుచేసుకునేవారమని, సేద్యాలకు అదనపు ఖర్చులు అయ్యేవి కావని రైతులు అంటున్నారు. నియోజకవర్గంలోని సింహాద్రిపురం, వేముల, తొండూరు, వేంపల్లె మండలాల్లో అత్యధికంగానూ, పులివెందుల, లింగాల మండలాల్లో తక్కువ విస్తీర్ణంలో సాగుచేయనున్నారు. ఇప్పటికే రైతులు పొలాల్లో సేద్యాలు చేసి సాగుకు సిద్ధం చేసుకున్నారు. అక్టోబర్ 15 నుంచి వర్షాలు వస్తే శనగ సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే వర్షాలతో భూములు పదును కావడంతో కొంతమంది రైతులు మినుము పంటపై దృష్టిపెట్టి సాగుచేస్తున్నారు.

నియోజకవర్గానికి 15వేల క్వింటాళ్ల శనగలు మంజూరు

ఈ ఏడాది రబీ సీజన్‌కు పులివెందుల నియోజకవర్గానికి 15,305 క్వింటాళ్లు శనగ విత్తనాలు మంజూరయ్యాయి. ఖరీఫ్‌లో పంటలు లేక నష్టపోయిన రైతుల ను ఆదుకునేందుకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను రైతులకు అందిస్తోంది. ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. గతంలో 25కిలోల ప్యాకెట్ ద్వారా రైతులకు శనగ విత్తనాలు అందేవి. అయితే ఈ యేడు రబీ సీజన్‌కు 20కిలోల ప్యాకెట్లను ప్రభుత్వం అందజేస్తోంది. ఎకరాకు 2 ప్యాకెట్ల చొప్పున గరిష్టంగా 10 ప్యాకెట్ల వరకు రైతులకు సబ్సిడీ విత్తనాలను ఇవ్వనున్నారు.

అక్టోబర్ 10న రైతులకు పంపిణీ

రబీ సీజన్‌లో పంటలను సాగుచేసుకునేందుకు వీలుగా అక్టోబర్ 10 నుంచి రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో క్వింటా రూ.4,860 లతో రైతులకు అందిస్తోంది. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయశాఖ సూచించిన తేదీ నుంచి రిజిష్టర్ చేయించుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించిన రైతులకు శనగ విత్తనాలు అందిచనున్నారు.

నియోజకవర్గంలోని మండలాల వారీగా శనగ విత్తనాలు ఇలా .. పులివెందుల 1440 క్వింటాళ్లు, వేముల 3860 క్వింటాళ్లు, వేంపల్లె 1810 క్వింటాళ్లు, లింగాల 1670 క్వింటాళ్లు, సింహాద్రిపురం 5195 క్వింటాళ్లు, తొండూరు 1330 క్వింటాళ్లు మంజూరయ్యాయి.

విత్తన కొరత లేదు

రబీలో శనగ పంట సాగుచేసుకునేందుకు 40శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతన్నలకు శనగ విత్తనాలను అందిస్తోంది. రబీ సాగుకు విత్తనాల కొరత లేదు. అవసరమైన ప్రతి రైతుకు రాయితీ శనగ విత్తనాలను అందిస్తాం. ఎకరాకు 20కిలోల ప్యాకెట్ చొప్పున గరిష్టంగా 10 ప్యాకెట్లు రైతులకు పంపిణీ చేస్తాం

– చెన్నారెడ్డి ఏవో, వేముల

బస్సుల దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని వై-జంక్షన్ వద్ద రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ట్రాఫిక్‌ను మళ్లించినట్లు డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. రాజంపేట, బద్వేల్ వైపు నుంచి వచ్చే పల్లె వెలుగు బస్సులను పాత రూట్‌లో అప్సర థియేటర్ మీదుగా, తిరుపతి వైపు నుంచి వచ్చే బస్సులు మహావీర్ సర్కిల్, న్యూ కలెక్టరేట్, వర్క్‌షాప్, సబ్ జైలు మీదుగా వెళ్తాయన్నారు. కడప నుంచి నెల్లూరు వైపు వెళ్లే బస్సులు పాత బస్టాండు, అప్సర సర్కిల్ మీదుగా, నెల్లూరు నుంచి కడపకు వచ్చేటపుడు సబ్ జైలు, ఆర్టీసీ వర్క్‌షాప్ మీదుగా వెళ్తాయని తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్: 80 ఏళ్లు దాటిన వృద్ధులను సన్మానించడం అభినందనీయమని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నగరంలోని బుడ్డాయిపల్లె సచివాలయంలో 80 ఏళ్లు దాటిన 15 మంది సీనియర్ ఓటర్లను సన్మానించారు.

15 నుంచి నవరాత్రి వేడుకలు

కడప కల్చరల్: ఈ నెల 15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ బెస్తవేముల రామమహేష్ తెలిపారు. స్థానిక వాసవీ కన్యకాంబ ఆలయంలో బ్రోచర్లకు అమ్మవారి సన్నిధిలో పూజలు చేయించిన అనంతరం అర్చకులు, ఉత్సవాల నిర్వహణ కమిటీ, ఇతరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రముఖులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు.

నేడు జంతు వధ చేయరాదు

కమలాపురం : గాంధీ జయంతిని పురస్కరించుకు ని సోమవారం కమలాపురం నగర పంచాయతీ పరిధిలో జంతు వధ చేయరాదని నగర కమిషనర్ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్, మటన్ సెంటర్లతో పాటు మాంసాహార హోటల్ యజమానులు ఆ రోజు మాంసాహారం విక్రయించరాదన్నారు. విక్రయాలు జరిపితే కేసు నమోదు చేసి రూ.5వేలు జరిమాన విధిస్తామన్నారు.

ఎర్రగుంట్ల : గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో మాంసం విక్రయాలు చేయకూడదని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే మానసికోల్లాసం

– సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్

కడప స్పోర్ట్స్: క్రీడల్లో రాణించడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరంలోని పి.వి.ఆర్.స్పోర్ట్స్ ఎరీనాలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా స్థాయి పురుషుల డబుల్స్ విభాగం టోర్నమెంట్-23 ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ క్రీడలకు వయసుతో సంబంధం లేదన్నారు. గెలుపుతో వచ్చే ఉత్సాహం, క్రీడల్లో పాల్గొంటే కలిగే ఆనందం చక్కటి జ్ఞాపకాలన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ రోజూ సాధన చేసే మధ్య వయసు క్రీడాకారులకు ఈ టోర్నమెంట్‌లు ఎంతో ఉత్సాహాన్నిస్తాయన్నారు. పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు స్పోర్ట్స్ ఎరీనాను వినియోగించుకుని ఉత్తమ శ్రేణి క్రీడాకారులుగా రాణించాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు.